# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-01-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **జాతీయ సైనిక దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భారత సైన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.**

**2.** **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు అధునాతన యుద్ధనౌకలను జాతికి అంకితం చేశారు.**

3. **కనుమ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు.**

**4.** **రాష్ట్రంలోని పురాతన దేవాలయాల పునర్నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.**

**5.** **ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్ 2025లో మకర సంక్రాంతి సందర్భంగా 3.5 కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.**

============================

జాతీయ సైనిక దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భారత సైన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. సైన్యం మన దేశ సరిహద్దులను, అంతర్గత భద్రతను రక్షించడంలో అసాధారణమైన ధైర్యాన్ని ప్రదర్శిస్తోందని ఆమె ప్రశంసించారు. సైనిక దినోత్సవం సందర్భంగా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ భారత సైన్యానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు, వారి అత్యుత్తమ వృత్తి నైపుణ్యం, అచంచలమైన అంకితభావం, దేశ నిర్మాణానికి వారు చేస్తున్న గణనీయమైన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా జాతీయ సైనిక దినోత్వవం పై మరింత సమాచారాన్ని పలాస నుంచి హానరరీ కెప్టెన్ గణేష్ రావు అందిస్తారు.

..వాయిస్.. 36 సెకన్లు

---------------------------

విద్యార్థినీ విద్యార్థులలో పరీక్షలకు సంబంధించిన ఒత్తిడిని తగ్గించి .... వారిని పరీక్షలకు సంసిద్ధులుగా తీర్చి దిద్దే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చా కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి పేర్ల నమోదు గడువు నిన్నటితో ముగిసిన క్రమంలో భారత దేశం నుండే కాకుండా విదేశాల నుండి కూడా ఇప్పటివరకు 3 కోట్ల 56 లక్షల మందికిపైగా విద్యార్థినీ విద్యార్థులు ..., తల్లిదండ్రులు ..., ఉపాధ్యాయులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్షా పే చర్చా కార్యక్రమం విద్యార్థుల మానసిక అభ్యున్నతికి బాటలు పరచి...పరీక్షలలో వారికి సానుకూల దృక్పథం పెంపొందిస్తోంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు అధునాతన యుద్ధనౌకలు.. ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, జలాంతర్గామి వాఘ్‌షీర్‌లను జాతికి అంకితం చేశారు. ముంబయిలోని నేవల్ డాక్‌యార్డ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ...

..వాయిస్.. 35 సెకన్లు..

---------------------------

రైతుల జీవితాలతో విడదీయరాని అనుబంధం పెనవేసుకొన్న పశు సంపదను పూజించే పవిత్ర కర్తవ్యాన్ని కనుమ పండుగ మనకు తెలుపుతుందంటూ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కనుమ పండగ శుభాకాంక్షలు తెలిపారు. కమ్మని విందుల కనుమ పండుగ అందరి కుటుంబంలో సంతోషం నింపాలని ఆకాంక్షించారు. కుటుంబ విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు వివరించారు.

---------------------------

రాష్ట్రంలోని పురాతన దేవాలయాల పునర్నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరు నగరంలోని ధర్మరాజుల ఆలయం.. శివాలయాలను నిన్న సాయంత్రం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణతో కలిసి పరిశీలించారు.. అనంతరం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ..నెల్లూరులోని పురాతన దేవాలయాలకు పునర్ వైభవాన్ని తీసుకొస్తామన్నారు.

---------------------------

రైతులకు వ్యవసాయంలో చేదోడుగా ఉంటున్న పశు సంపద దైవంతో సమానమని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. కనుమ పండుగ సందర్భంగా ఈరోజు శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం నిమ్మాడలో ఆయన కుటుంబ సమేతంగా గో సేవలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... ఎన్డీయే ప్రభుత్వంలో పశు సంపద పరిరక్షణ కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా పశువులకు మినీ గోకులం షెడ్ల నిర్మాణాలు, పశు గ్రాస క్షేత్రాలకు రాయితీ వంటి కార్యక్రమాలు తిరిగి ప్రారంభించామని పేర్కొన్నారు.

---------------------------

ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్ 2025 లో నిన్న మకర సంక్రాంతి సందర్భంగా 3.5 కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ కార్యక్రమంలో పర్యాటకుల భద్రతకు పోలీసులు, పారామిలిటరీ బలగాలు, స్థానిక భద్రతా సిబ్బందితో సహా 50 వేల మందికి పైగా మోహరించారు. అదనంగా, నదీ తీరంలో పరిశుభ్రతను కాపాడేందుకు గంగా సేవా వాలంటీర్లను ప్రభుత్వం నియమించింది. వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా, అనేక దేశాల నుంచి వచ్చే పర్యాటకులు, భక్తుల సౌకర్యార్థం చేసిన ఏర్పాట్లపై మా ప్రతినిధి మరింత సమాచారాన్ని అందిస్తారు.

..వాయిస్..35 సెకన్లు

---------------------------

బాపట్ల జిల్లా వేమూరులో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు, బొమ్మల కొలువులు, పిల్లలకి భోగి పళ్ళు వంటి పలు సాంప్రదాయ పోటీలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.కాగా పోటీలలో ప్రతిభ చూపిన మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే తెలుగు సంస్కృతి ,సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. అటువంటి సంక్రాంతి వేడుకాలలో ప్రజలు పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొంటూ..

వాయిస్ .. 25 సెకన్లు

---------------------------

శ్రీశైలంలో శ్రీ మల్లికార్జున స్వామివారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈరోజు వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో అధికారులు ఆర్జిత అభిషేకాలు, కుంకుమార్చన నిలిపివేశారు. అదేవిధంగా రద్దీ దృష్ట్యా భక్తులకు అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లు, కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు ఎప్పటికప్పుడు అల్పాహారం, పాలు, మంచినీరు అందిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు వెల్లడించారు.

---------------------------

గుంటూరు జిల్లా తెనాలిలోని లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తెప్పోత్సవం నిన్న నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెప్పోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని తెలుపుతూ..

..వాయిస్... 21 సెకన్లు

======================